క్లుప్తంగా

మెనూ చార్జీలు పెంచాలి

నంద్యాల(అర్బన్): వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచి, ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని సీఐటీయూ నంద్యాల జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం కోరారు. అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చి కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం నంద్యాల రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సేవలు అందిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లకు వేతనాలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు తోటమద్దులు, యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మలమ్మ, రమణమ్మ, వెంకటేశ్వరమ్మ, సావిత్రి పాల్గొన్నారు.

ఎరువులు ఎమ్మార్పీకే విక్రయించాలి



ఉయ్యాలవాడలో ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ

ఉయ్యాలవాడ : ఎరువులు, పురుగు మందులను ఎమ్మార్పీకే విక్రయించాలని దుకాణ యజమానులకు మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతుల వేలి ముద్రలు తీసుకుని ఎరువులు, క్రిమి సంహారక మందులు విక్రయాలు జరపాలన్నారు. ఎరువులు, మందులు కృత్రిమ కొరత సృష్టిస్తే దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ–పాస్ విధానం తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

త్రోబాల్ పోటీల లోగో ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరిస్తున్న దస్తగిరిరెడ్డి

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 28వ తేదీ నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి ఏజీఎఫ్ త్రోబాల్ పోటీల లోగోను స్థానిక గురురాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గురురాఘవేంద్ర ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ దస్తగిరిరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 66వ స్కూల్ గేమ్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్–14 2022–23 బాలుర, బాలికల త్రోబాల్ స్టేట్ చాంపియన్‌షిప్ పోటీలను 30వ తేదీ వరకు స్కూల్ మైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13 జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు, 50మంది అఫీషియల్స్, 70మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ సీఎం కప్ స్టేట్ కో ఆర్డినేటర్ ఏపీ రెడ్డి, జిల్లా స్కూల్ గేమ్ కార్యదర్శి రమణారెడ్డి, దండె నాగరాజు, సుబ్బారావు, రాజశేఖర్, వీరయ్య పాల్గొన్నారు.

ఓంకార క్షేత్రానికి రూ.7.08 లక్షల ఆదాయం

బండిఆత్మకూరు: ఓంకార క్షేత్రంలో బుధవారం దేవస్థానం అధికారులు టెంకాయల వేలం పాట నిర్వహించారు. ఈ వేలంపాట ద్వారా రూ.7.08 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ నాగ ప్రసాద్ తెలిపారు. గతేడాది టెంకాయల వేలంలో రూ.6.70 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. గతేడాదికంటే ఈ ఏడాది అదనంగా రూ.38 వేలు వచ్చిందని వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ విశ్వనాథ్‌రెడ్డి, తనిఖీ అధికారి హరిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

గ్రామ సేవకుడి నియామకం

రుద్రవరం: మండలంలోని బీరవోలు గ్రామానికి నూతన గ్రామ సేవకుడిగా కూడాల చిన్న వెంకటపతిని నియమించారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం ఆయనకు నియామక ఉత్తర్వులను తహసీల్దార్ అందజేశారు. తహసీల్దారు మాట్లాడుతూ గతంలో గ్రామ సేవకుడిగా పని చేస్తున్న వెంకటపతి మృతి చెందడంతో ఆయన స్థానంలో మరొకరిని నియమించినట్లు తెలిపారు. అనంతరం జాతీయ ఓటర్లదినోత్సవం రెవెన్యూ సిబ్బందితో ప్రమాణం చేయించారు.

తప్పిన పెను ప్రమాదం



దెబ్బతిన్న కారు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బుధవారం కాల్వ వద్ద ముందు వెళ్తున్న టిప్పర్ ఉన్నట్టుండి కుడివైపు తిరగడంతో వెనుక వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో ఎవ్వరికి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న హైవే సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని కారును, టిప్పర్‌ను రోడ్డుపై నుంచి తొలగించారు.



పార్వేట పల్లకీని ఆలమూరు గ్రామంలో ఊరేగిస్తున్న దృశ్యం



ఆలమూరులో వెలసిన దుకాణాల వద్ద విక్రయదారుల సందడి

పల్లకీ వచ్చే.. పండుగ తెచ్చే

రుద్రవరం: అహోబిలేశుడి పార్వేట పల్లకీ రావడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది. పల్లకీ రావడానికి రెండు రోజుల ముందు నుంచే లోగిళ్లు బంధువులు, స్నేహితులతో కళకళలాడుతున్నాయి. ముఖ్యంగా కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ తమ ఆడపడుచులను ఆహ్వానించడం ఆనవాయితీ. మండలంలోని ఆలమూరుకు పార్వేట ఉత్సవ మూర్తులు శ్రీ జ్వా లా నరసింహుడు, శ్రీ ప్రహ్లాదవరద స్వామి వారి పల్లకీ రాకతో బుధవారం గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఇళ్ల ముందు కల్లాపు జల్లి, పూజలు చేసి, పండి వంటలు తయారు చేసి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించి, పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. రెండో రోజు స్వామి వారి పల్లకీ ఆయా కాలనీల్లోని తెలుపుల మీదకు చేరుకోవడంతో కుటుంబ సభ్యులతో పాటు పక్క గ్రామాల నుంచి వచ్చిన బంధువులందరూ పూలు, పండ్లు,కాయ,కర్పూరం, నైవేద్యం వంటి వాటిని స్వామి వార్ల సమర్పించి పూజలు చేశారు. భక్తులకు అర్చకులు కళ్యాణ రంగస్ సెటారుతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి గ్రామ సర్పంచ్ పాణ్యం లక్ష్మీదేవి, గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు చేసి పల్లకీని తిమ్మనపల్లెకు సాగనంపారు. గ్రామ పొలిమేరలో ఆ గ్రామ పెద్దలు, భక్తులు పెద్దఎత్తున ఎదురేగి పల్లకీకి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించొద్దు

నంద్యాల(అర్బన్): పోరాటాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరిస్తే ఊరుకునేది లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలంటూ సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమీపంలో నిరాహార దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ వైజాగ్ నగరంలో 32 మంది ప్రజల బలిదానాలు, 26 వేల మంది రైతుల త్యాగాలు, శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యుల రాజీనామాలతో విశాఖ ఉక్కును ఆంధ్రుల హక్కుగా సాధించుకున్నామని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలని చూస్తే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సీపీఐ, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా విశాఖ ఉక్కు పరిరక్షణకు ఈ నెల 27న జరిగే కార్మిక మహాగర్జనకు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, నాయకులు సుగుణమ్మ, భాస్కర్, సోమన్న, భార్గవ్, నాగరాముడు, ధనుంజయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పేదల ముంగిటకే సంక్షేమ పథకాలు

- టీడీపీ, పచ్చ మీడియా దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మరు
- కొత్తపల్లెలో 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శిల్పా రవి



మహిళకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల(రూరల్): పేదల ముంగిటకే సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి తెలిపారు. నంద్యాల మండలం కొత్తపల్లె గ్రామంలో బుధవారం స్థానిక నాయకులు, అధికారులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామ నాయకులు, ప్రజలు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. గ్రామంలో రెండో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా అంటూ.. ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఏ ఇంటికి ఎన్ని సంక్షేమ పథకాలో అందాయో, ఆయా కుటుంబాలకు జగనన్న సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడున్నరేళ్ల పాలనలో ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం తరుపున అనేక సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల్లో లబ్ధి చేకురిందన్నారు. అర్హులందరికీ పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అందిస్తామని చెప్పారు. అర్హతలు ఉన్నప్పటికీ ప్రభుత్వ పథకాలు అందని వారు ఏ మాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సంబంధిత పత్రాలను సచివాలయాల్లో ధ్రువ పత్రాలు అందజేస్తే న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అర్హులందరికి అందుతున్నాయని, వీటితో టీడీపీ నాయకులకు కూడా భారీగా లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును చూసి ఓర్వలేక టీడీపీ, పచ్చ మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, నంద్యాల మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, మండల అధికారులు, గ్రామ నాయకులు నరేంద్రరెడ్డి, శరత్‌రెడ్డి, బాలవెంకటరెడ్డి, ఎంపీటీసీ బొజ్జ హరినాథ్‌రెడ్డి, వైస్ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, మంద శ్రీనివాసరెడ్డి, బసవేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ప్రతిష్ఠోత్సవాలు



వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం,



ధ్వజ స్తంభాలకు ధాన్యం పోస్తున్న భక్తులు

రుద్రవరం: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతిష్ఠోత్సవ వేడుకలు శాస్త్రోక్తంగా సాగుతున్నాయి. పండితుల వేద మంత్రోచ్చారణలతో మహాగణపతి, సుబ్రహ్మణ్య, ఆంజనేయ, పార్వతి సమేత కాశీ విశ్వేర స్వామి విగ్రహాల పునఃప్రతిష్ఠ, ధ్వజ శిఖర కలశ సహిత లక్ష్మీ వేంకటేశ్వరస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠోత్సవ వేడుకలు మూడు రోజులుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలోలో పండితులు వివిధ రకాల పూజలు, హోమాలు చేపట్టడంతో పాటు నూతన వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. గ్రామోత్సవంలో చెక్క భజన, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ నెల 27న ప్రాణ ప్రతిష్ఠ ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వేడుకగా ప్రతిష్ఠోత్సవాలు

శిరివెళ్ల: కోటపాడులో శ్రీ చెన్నకేశవ, వీరభద్ర స్వామి నూతన ఆలయాల ప్రారంభోత్సవం, విగ్రహ, ధ్వజ స్తంభాల ప్రతిష్ఠోత్సవాలు బుధవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. టీటీడీకి చెందిన రుత్వికుల బృందం గంగాయానం, గణపతిపూజ, పుణ్యావాచనం, పంచగవ్యప్రాసన కార్యక్రమాలు చేపట్టారు. పంటలు బాగా పండాలని గ్రామస్తులు ధ్వజ స్తంభాలకు ధాన్యం పోసి పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ వేణునాథ రెడ్డి, ఆలయ చైర్మన్లు వంకదార నరేంద్రబాబు, గురజాల గోపాలరెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకుడు వంకదార సుబ్బసత్యనారాయణశ్రేష్టి, సర్పంచు దూదేకుల గుర్రప్ప, గ్రామ పెద్దలు మేర్వ శ్రీరామరెడ్డి, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

అభాగ్యులకు అండ.. సీఎం రిలీఫ్ ఫండ్

- కరీముల్లా కుటుంబానికి రూ. 6 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ముఖ్యమంత్రి సహాయ నిధి అభాగ్యులకు అండగా ఉంటూ ఆదుకుంటోందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి అన్నారు. ఆర్టీఓ కార్యాలయంలో ఏజెంట్‌గా ఉంటూ 7 మాసాల క్రితం మృతి చెందిన కరీముల్లా కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 6లక్షల చెక్కును అందజేశారు. బుధవారం ఎమ్మెల్యే నివాస గృహంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, 39వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో చెక్కును కరీముల్లా తండ్రి మాసుం వలికి అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం సహాయ నిధిని బాధిత కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కౌన్సిలర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ కరీముల్లా మృతి చెందిన సమయంలోనే ఆయన కుటుంబానికి రూ. 3లక్షలు సొంతంగా అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారన్నారు. కుటుంబాన్ని ఆదుకుంటామని ఇచ్చిన హామీ మేరకు అధికారులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి పరిహారం లభించేలా చేశారని చెప్పారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డికి, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని మృతుడి భార్య సమియా తెలిపారు.

రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



గ్రౌండ్ కంట్రోల్ పాయింట్స్ చెకింగ్ పనులను పరిశీలిస్తున్న మండల సర్వేయర్ మల్లయ్య

దొర్నిపాడు : ప్రభుత్వం తీసుకొచ్చిన భూ రీసర్వేతో రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మండల సర్వేయర్ మల్లయ్య తెలిపారు. జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష పథకంలో భాగంగా బుధవారం మండలంలోని కొండాపురం గ్రామంలో 17 గ్రౌండ్ కంట్రోల్ పాయింట్స్‌ను చెక్ చేశారు. అధునాతన సాంకేతిక పరికరాలతో భూ సర్వే చేస్తున్నట్లు చెప్పారు. అలాగే గుండుపాపల, డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామాల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు చేయాల్సి ఉందని చెప్పారు. హద్దుల విషయంలో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ రీ సర్వేతో పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ సర్వేయర్లు గంగాధర్, నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌కే యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలను అందిపుచ్చుకుంటున్న రామకృష్ణారెడ్డి

నంద్యాల(వ్యవసాయం): రాయలసీమ ప్రాంతంలో ఇన్నోవేషన్ ఇంటర్ ప్రెన్యూర్‌షిప్ అభివృద్ధి చేయడంలో భాగంగా శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీ అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ అనంతపురం వారితో నంద్యాలలోని శ్రీరామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలు బుధవారం అవగాహన ఒప్పందంపై కుదిరింది. స్థానిక కళాశాలలో జరిగిన ఒప్పందంలో ఏఐసీఎస్‌కేయూ సీఈఓ ఎంఎస్ శివకిరణ్, రామకృష్ణ డిగ్రీ కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, పరస్పర అవగాహన ఒప్పంద పత్రాలను ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ ఎంఆర్‌కే రెడ్డి, ఏఐసీఎస్‌కేయూ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగభూషణంరాజు సమక్షంలో ఇచ్చిపుచ్చుకున్నారు. వీసీ మాట్లాడుతూ ఏఐసీ ఎస్‌కేయూ ఇప్పటికే దాదాపు 20 విద్యాసంస్థలతో ఎంఓయూ కుదుర్చుకొని మంచి ప్రావీణ్యం సాధించిన దృష్ట్యా మిగతా విద్యాసంస్థలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో భాగంగా సంవత్సరం పాటు రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులు,అధ్యాపకులకు అంకుర పరిశ్రమల స్థాపన, సంబంధిత అంశాలపై దశలవారిగా తర్ఫీదునిస్తామని చెప్పారు. ఎంబీఏ, ఎంకాం, బీబీఏ విద్యార్థులకు మెళకువలు నేర్పి, అంకుర పరిశ్రమలను స్థాపించడానికి కావలసిన సహాయ సహకారాలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్బయ్య, కళాశాల మేనేజర్ ప్రగతిరెడ్డి పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు గోవాలో జరిగిన ఇంటర్నేషనల్ సిటో రియో కరాటే పోటీల్లో రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ చూపించి పతకాలు సాధించారని ఏపీ కరాటే అసోసియేషన్ టీం మేనేజర్ షేక్‌నూర్ బాషా బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గోవాలోని మాబుసా పెద్దెం ఇండోర్ స్టేడియంలో ఈనెల 21, 22, 23 తేదీల్లో జరిగిన పోటీల్లో రాష్ట్రం నుంచి 53 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పాల్గొని 36 బంగారు, 12 వెండి, 5 కాంస్య పతకాలు సాధించారని చెప్పారు. వీరికి ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మహానంద్ అశోడ్కర్ మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేరని వివరించారు.


తాగునీటి సరఫరాపై శ్రద్ధ చూపాలి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన రక్షిత మంచినీటి సరఫరా పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఈఓ ఎస్ లవన్న సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మహాశివరాత్రి ఏర్పాట్లలో భాగంగా దేవస్థాన రక్షిత మంచినీటి సరఫరాను పరిశీలించారు. ఫిబ్రవరి 11 నుంచి 22 వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివగంగ జలప్రసాదం, మల్లికార్జునసదన్, గంగా గౌరీ సదన్, శివదీక్షా శిబిరాలు, కల్యాణకట్ట, ఘంటామఠం, మల్లమ్మ కన్నీరు, జిల్లా పరిషత్ అతిథి గృహం, జగద్గురు మఠం, దేవస్థానం వైద్యశాల, దేవస్థాన అన్నప్రసాద వితరణ, టూరిస్ట్ బస్టాండ్ తదితర చోట్ల ఏర్పాటు చేసిన ప్లాంట్లను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో పూర్తిశాస్త్రీయ ప్రమాణాలను పాటించాలన్నారు. ఎప్పటికప్పుడు నీటి క్లోరినేషన్ ప్రక్రియపై శ్రద్ధ వహించాలని ఆదేశించారు. నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈఈ నాగేశ్వర రావు, డీఈఈ నరసింహారెడ్డి, మల్లికార్జునప్రసాద్, పీఆర్వో టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



శుద్ధజల ట్యాంక్‌లను పరిశీలిస్తున్న ఈఓ,అధికారులు

శనగలో పంట కోత ప్రయోగం



బోడెమ్మనూరులో శనగలో పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న అధికారులు

ఉయ్యాలవాడ : మండలంలో రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పు శనగ పంట కోతలు ప్రారంభమైన విషయం తెలిసిందే. బుధవారం బోడెమ్మనూరు గ్రామంలో వ్యవసాయాధికారులు శనగలో పంట కోత ప్రయోగం చేపట్టారు. గ్రామానికి చెందిన బచ్చు శివనాగిరెడ్డి 0.80 ఎకరాల విస్తీర్ణంలో 5 మీటర్లలో పంట కోత ప్రయోగం చేయగా 3.645 కేజీలు దిగుబడులు వచ్చాయి. అలాగే కర్నాటి దస్తగిరిరెడ్డికి చెందిన 1.77 ఎకరాల్లో పంట కోత ప్రయోగం చేయగా 6.399 కేజీల దిగుబడి వచ్చినట్లు జిల్లా జాతీయ గణాంక శాఖ సీనియర్ అధికారిణి అమృత తెలిపారు. ఏఈఓ రాణెమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకుడు జగన్‌మోహన్, రైతులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): డోన్ మండలం దొరపల్లె వంతెన వద్ద ఇటీవల మృతి చెందిన ఒక్కో కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు కోరారు. సర్వీస్ రోడ్డు లేకపోవడంతోనే దొరపల్లె వంతెన నేషనల్ హైవే–44 ప్రమాదాలకు నిలయంగా మారి ఇప్పటివరకు 18 మంది మృత్యువాత పడటం ఆందోళనకరమన్నారు. మృతి చెందిన కుటుంబాలకు తక్షణమే ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు సీపీఐ నాయకులు బుధవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం రంగనాయుడు మాట్లాడుతూ మృతి చెందిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాతో పాటు గాయాల పాలైన బాధితులకు సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులతో సంప్రదించి న్యాయం చేస్తామని కలెక్టర్ బాధితులకు భరోసా ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సుంకయ్య, రాముడు, భార్గవ్, కొండయ్య, విజయుడు, కృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

బాలుడికి అరుదైన ఆపరేషన్



ఆపరేషన్ అనంతరం బాలుడితో వైద్యులు

నంద్యాల(వ్యవసాయం): పుట్టుకతో మూసుకుపోయిన ముక్కు ద్వారానికి అరుదైన శస్త్ర చికిత్స చేసి గాలి పీల్చుకునేలా చేశారు మధుమణి నర్సింగ్‌హోం వైద్యులు. వివరాలు.. అనంతపురం జిల్లా నారుపల్లికి చెందిన మల్లికార్జునరెడ్డి కుమారుడు పవన్‌కుమార్ రెడ్డికి పుట్టుకతోనే ముక్కు ద్వారా గాలి పీల్చుకోలేక ఇబ్బందులు పడుతుండేవాడు, ముక్కు, గొంతుకు మధ్యలో ఉన్న ద్వారం పూడికతో మూసుకుపోవడం వల్ల జలుబు, దగ్గు, జ్వరం, ఊపిరి ఆడక ఇబ్బంది పడుతుండేవాడు. స్థానిక మధుమణి నర్సింగ్ హోంలో సంప్రదించగా మంగళవారం మధ్యాహ్నం వైద్యులు మధుమణి, మణిదీప్, రోహిత్, రవికృష్ణ వైద్య చికిత్స చేశారు. ఆసుపత్రి అధినేత డాక్టర్ మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఈ జబ్బును కొయానల్ అట్రీషియా అంటారని, గతంలో పది మంది పిల్లలకు ఆపరేషన్ చేశామని చెప్పారు. అధునాతన పరికరాలు ఉపయోగించి ముక్కు, గొంతుకు మధ్య ఉన్న 5 మీటర్ల వెడల్పు ఎముకలు, ముక్కు దూలం వెనుకటి భాగాన్ని తొలగించి తలలోని ఎచ్చుతగ్గులను డ్రిల్లింగ్ ద్వారా చికిత్స చేసి శ్వాస నాళాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. ప్రస్తుతం బాలుడు ముక్కు ద్వారా గాలి పీల్చుకుంటున్నాడని తెలిపారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



తహసీల్దార్ కార్యలయంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ జయప్రసాద్

దొర్నిపాడు: ఓటు హక్కును యువత వదులుకోవద్దని, సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జయప్రసాద్ అన్నారు. బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కార్యాలయంలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో కీలకమైందన్నారు. మండలంలో మొత్తం 19,626 ఓటర్లు ఉన్నారని వారిలో పురుషులు 9,805, మహిళలు 9,821 మంది ఉన్నట్లు చెప్పారు. మొత్తం 26 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వీఆర్ఓలు సాంబశివుడు, సావిత్రి, నాగేష్, నారాయణస్వామి, జూనియర్ అసిస్టెంట్ చిన్నగోవిందు పాల్గొన్నారు.

శిరివెళ్ల: ఓటు వజ్రాయుధమని తహసీల్దార్ షేక్ మొయిద్దీన్ అన్నారు. బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ ఓటుకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ప్రతి ఒక్కరూ సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. మండలంలో 45,876 మంది ఓటర్లు ఉన్నారని, కొత్తగా 1,245 మందికి ఓటు హక్కు కల్పించామన్నారు. అనంతరం 50 మంది కొత్త ఓటర్లకు ఓటర్ గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సుచరిత, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించండి

రుద్రవరం: గృహాలు మంజూరైన లబ్ధిదారులను చైతన్య పరిచి నిర్మాణాలు ప్రారంభించేలా చూడాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి సూచించారు. మండలంలోని ఎర్రగుడిదిన్నె గ్రామ సచివాలయంలో బుధవారం ఉద్యోగులు, హౌసింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు గృహాలు నిర్మంచుకుంటే అందే సౌకర్యాలు, రుణం తదితర వాటి గురించి అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం సిబ్బందితో కలిసి లే అవుట్‌లో నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్ తదితరులు ఉన్నారు.

గిరిజనులకు మౌలిక వసతులు కల్పిస్తాం

మహానంది: గిరిజనులకు మౌలిక వసతులు కల్పిస్తామని ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి తెలిపారు. మహానంది సమీపంలోని చెంచులక్ష్మి గిరిజన గూడేన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఆయన సందర్శించారు. ఇటీవల గిరిజనులు మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ మేరకు ఆయన ఆదేశించడంతో పీఓ రవీంద్రారెడ్డి, తహసీల్దార్ జనార్దన్‌శెట్టి, అధికారులు గూడెం చేరుకుని గిరిజనులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఎన్నో ఏళ్లుగా అడవితల్లిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని, మాకు ఇచ్చిన భూములు కాపాడుకునేందుకు ఇక్కడే ఉంటూ పోరాటం చేస్తున్నామని గిరిజనులు తెలిపారు. అధికారులు స్పందించి మా భూములకు నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.